క్లుప్తంగా

మహిళలకు ఉచిత శిక్షణ



కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు

దెందులూరు: ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు ఆధ్వర్యంలో దెందులూరు ఆర్‌సీఎం చర్చి పరిధిలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్టు ఫాదర్ జి.అమ్మన్ రాజా అన్నారు. 35 మంది మహిళలు తొలి విడతగా కుట్టు శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి సాధిస్తూ ఆర్థికంగా కుటుంబానికి చేయూతగా ఉండాలన్నది సంస్థ లక్ష్యమన్నారు. సోమవారం దెందులూరు కేంద్రంలో ఆయన మహిళలకు అందిస్తున్న కుట్టు శిక్షణను పరిశీలించారు.

మహిళలపై హింస నిరోధానికి సమష్టి కృషి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

గణపవరం: మహిళలపై రోజురోజుకూ పెరిగిపోతున్న హింసా ప్రవృత్తి నిరోధానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. సోమవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధురాజు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను నిరోధించడానికి ఐక్యరాజ్యసమితి ఆశయానికి అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తయారుచేసిన సోషల్ మీడియా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ స్వరూపరాణి, అధ్యాపకులు టి.అక్కిరాజు, శ్రీనివాసరావు, వెంకట్రావు, శారదాదేవి, వెంకటరమణ పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం



వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న బాలబాలికలు

పెదవేగి : మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుష అన్నారు. డిసెంబర్ 3 ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చెవిటి, మూగ, మానసిక ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు మంగళవారం నిర్వహించే ఆటల పోటీలకు ప్రకాష్‌నగర్‌లోని ప్రత్యేక పాఠశాల చిన్నారులు సిద్ధమవుతున్నారు.

స్కూల్ గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెదపాడు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్‌లో జూడో పోటీల్లో వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఏపీ స్కూల్ గేమ్స్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు రెండు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టీ సునీలకుమారి, జి భవాని, విద్యార్థులను అభినందించారు.

28న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఉంగుటూరు: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణం హనుమంతురావు, ఆలయ ఈవో కలగర శ్రీనివాసరావు తెలిపారు. ఈ వ్రతాల్లో పాల్గొనే వారికి స్వామి ప్రతిమ, ప్రసాదం ఉచితంగా అందజేస్తామని తెలిపారు. పూజల్లో కూర్చునే భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన

పెదపాడు: తోటగూడెంలో నిర్మిస్తున్న రహదారులను పెదపాడు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మురళి పరిశీలించారు. తోటగూడెంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రహదారుల నిర్మాణ పనులు చేస్తున్నారు. సోమవారం రహదారులను స్థానిక నాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అజయ్‌తో కలిసి మురళి పరిశీలించారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పెదవేగి : పాఠశాల నిర్వహణ సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని పెదవేగి ఎంఈవో-1 ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పెదవేగి మండల ఎంఈఓ- 1గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎస్టీయూ మండల కార్యవర్గం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పరసా నాగార్జున, ఎండీ షఫీ, గుప్త, భూషణం పాల్గొన్నారు.

ఉల్లి.. ధర ఘాటు

- అమాంతం పెరిగిన ఉల్లి ధరలు
- కిలో రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతున్న వైనం
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు
- సంక్రాంతి వరకూ పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు

పెదవేగి : ఉల్లి ధరలు ఆకాశన్నంటి కొనుగోలుదారులకు వాటిని కోయకుండానే కన్నీళ్లు రప్పిస్తున్నాయి. ఇప్పటికే భారీగా పెరిగిన ధర దిగి రాకపోవడంతో వినియోగదారులు అంత వ్యయం భరించలేక విలవిల్లాడుతున్నారు. ఉల్లిపాయలు కొనుగోలు చేయాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మార్కెట్లో గతంలో నాణ్యమైన ఉల్లి కిలో రూ.50 ఉన్న ధర ప్రస్తుతం రూ.80 పలుకుతోంది. ధరలు మరింత పెరగవచ్చని వ్యాపారులు అంటున్నారు. కర్నూలు, పూనే నుంచి ఉల్లి రవాణా లేకపోవడం, వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం వల్ల గిరాకీ ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఉల్లికి డిమాండ్ ఏర్పడుతుందని మార్కెట్ వర్గాలు చెప్పడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల్లో కిలో ఉల్లి ధర రూ.30పైగా పెరిగింది. ప్రధానంగా పెళ్లిళ్ల సీజను కావడం వల్ల ఉల్లి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లో ఉల్లిపాయల ధరలకు రెక్కలు వస్తున్నాయి. జూలై నాటికి దేశంలోని మార్కెట్లలో ఉల్లి సరఫరా నిలిచిపోతుంది. ప్రధానంగా కర్నూలు, పూనేలో ఉల్లి సాగు తగ్గడం, వర్షాభావం వల్ల ఉల్లి ధర పెరగడానికి ఒక కారణమైతే, ఉల్లి వ్యాపారుల సిండికేట్‌గా మారి ధరలను శాసించడం మరో కారణంగా కనిపిస్తోంది. దీంతో ఉల్లి కొనుగోలుకు మధ్యతరగతి, పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

మార్కెట్‌లో కర్నూలు, సోలాపూర్ ఉల్లి

ఇప్పటికే కర్నూలు రకం కిలో ఉల్లి ధర మార్కెట్‌లో రూ.55 నుంచి రూ.60 వరకు విక్రయిస్తుండగా, తాజాగా అది రూ.80కి చేరింది. మహారాష్ట్ర నుంచి వచ్చే ఉల్లిపాయలు గ్రామాల్లో చిల్లర వర్తకదారులు రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. వరదల ప్రభావంతో ఉల్లి పంట దెబ్బతిందని, ప్రస్తుతం ఉల్లి పంట నాట్లు ప్రారంభమయ్యాయని,



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

డిసెంబర్ నెలాఖరుకు, జనవరి మొదటి వారంలో గాని కొత్త ఉల్లిపాయలు వచ్చే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు ఉల్లిపాయలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సోలాపూర్‌కు చెందిన ఉల్లిపాయలు మార్కెట్‌లోకి కొద్దిగా దిగుమతి అవుతున్నాయి.

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం

సివిల్ సప్లై శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయలోపంతో మేము ఉల్లిపాయలను అమ్మలేమని చేతులెత్తేశారని పలువురు వినియోగదారులు ధ్వజమెత్తుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిపాయలను కొనుగోలు చేసి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సంక్రాంతి నాటికి ఉల్లి ధర సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకూ అధిక ధరలు తప్పవని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి ఉల్లి పంట మార్కెట్‌కు వస్తేనే ధరలు తగ్గే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు, వరదలకు ఉల్లి పంట దెబ్బతింది. దీంతో ఉల్లి పాయల ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కన్పించడం లేదు. ప్రభుత్వాలు ఉల్లి దిగుమతులపై దృష్టి పెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఆచితూచి కొంటున్నాం



ఉల్లి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో పాటు ఇతర కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఉల్లి ధర రెట్టింపు అవడంతో ఆచితూచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఉండ్రాజవరపు నాగమణి, గృహిణి

దిగుమతి లేదు



మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉల్లి దిగుమతి లేదు. ఒక్కసారిగా ధరలు పెరిగిపోయాయి. పెళ్లిళ్ల సీజన్ కావడం ప్రధాన కారణం. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యేవరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

– కె. సునీల్‌బాబు, దెందులూరు

మూతపడిన ప్రభుత్వ ఉల్లి విక్రయ కేంద్రాలు

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మహారాష్ట్రకు చెందిన మార్క్‌ఫెడ్ నుంచి రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ ఉల్లిపాయలను కొనుగోలు చేసి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఉల్లిపాయల ధర మండిపోతుంటే కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. సివిల్ సప్లై సెంటర్ల పేరుతో తూతూ మంత్రంగా కేంద్రాలు తెరిచినప్పటికీ ఒకటి, రెండు రోజులు మాత్రమే ఉల్లిపాయలను విక్రయించి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు. కేంద్రాల్లో విక్రయించే ఉల్లిపాయలు వారి దగ్గరే కుళ్లి కంపు కొడుతుంటే, వీటిని కొనుగోలు చేసి ఏమి చేసుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో సెంటర్లు వెలవెలబోవడంతో ఆయా మండల కేంద్రాల్లో దుకాణాలు మూసివేశారు.

మార్మోగిన శివ నామస్మరణ

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- కార్తీక మాసం చివరి సోమవారం విశేష పూజలు



నిడమర్రు: మందలపర్రులో ప్రత్యేక అలంకరణలో ఉమా నీలకంఠేశ్వరస్వామి



నిడమర్రు: దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



నిడమర్రు: పంచాయతన క్షేత్రంలో గంగా నదికి హారతి ఇస్తున్న కాశీ నుంచి వచ్చిన మహంతులు



భీమడోలు: గుండుగొలనులో స్వామి వారికి అన్నాభిషేక పూజలు చేస్తున్న పూజారులు



భీమడోలు: శివాలయంలో క్షీరాభిషేకం చేస్తున్న పూజారులు



దెందులూరు: ప్రత్యేకాలంకరణలో నాగలింగేశ్వరస్వామి

నిడమర్రు: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు, ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే నీలకంఠేశ్వరస్వామికి లింగార్చనలు, వివిధ పుష్ప, ఫలాలతో విశిష్ట అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన 16 రకాల ఫల, పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. 150 లీటర్ల ఆవుపాలతో శివలింగానికి అభిషేకం చేసి ఆ పాలతో అన్న ప్రసాదంలో పరమాన్నంగా వడ్డించారు. ఆలయ ప్రాంగణలోని యాగశాలలో రుద్ర హోమం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకూ కాశీ నుంచి వచ్చిన మహంతులతో గంగా హారతితోపాటు మహా నదులకు ప్రత్యేక హారతుల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కొలనులో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి అన్నాభిషేకం

భీమడోలు: గుండుగొలను, భీమడోలు, పూళ్ల, పోలసానిపల్లి, అంబర్‌పేటలో కొలువైన స్వామి వార్లను సోమవారం భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయాల్లో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. గుండుగొలనులో దేవదాయ ధర్మశాఖ పరిధిలోని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత నవరస ఫల అభిషేకాలు, ప్రత్యేకంగా 200 కేజీల బియ్యంతో అన్నాభిషేకం చేసారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. పోలసానిపల్లిలో స్వామివారికి విశేష పూజలు చేసారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

ఉంగుటూరు : చేబ్రోలు, ఉంగుటూరు, నారాయణపురం, నాచుగుంట, చింతాయిగుడెం, కంసాలిగుంట, కైకరం, రాచూరు, బొమ్మిడి శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు ఆలయాల్లో దీపాలు వెలిగించారు.

శివాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ

దెందులూరు: శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రాలయగూడెం నాగలింగేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాల పుష్పాలతో శివలింగానికి విశేష అలంకరణ చేశారు.

వ్యాయామ విద్యకు భవిష్యత్తులో అత్యధిక ప్రాధాన్యత



రిటైర్డ్ పీడీ సాంబశివరావును సత్కరిస్తున్న ప్రిన్సిపల్ నత్తానియేలు, అధ్యాపకులు

దెందులూరు: వ్యాయామ విద్యకు, మోడ్రన్ ఒలింపిక్స్‌కు స్ఫూర్తి ప్రదాత అయిన హెచ్‌సీ బక్ సేవలు చిరస్మరణీయమని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఇరుకుల పాటి సాంబశివరావు, ఏలూరు ఖోఖో, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నారు. సోమవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు అధ్యక్షతన వ్యాయామ విద్య ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ వ్యాయామ విద్యకు భవిష్యత్తులో అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు నిరంతర సాధన, ప్రణాళికబద్ధమైన కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేలు మాట్లాడుతూ హెచ్‌సీ బక్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ సాంబశివరావును ప్రిన్సిపల్, అధ్యాపకులు, డాక్టర్ రత్నబాబు, సాయి, కోటి, కళాశాల సిబ్బంది సత్కరించారు.

శాస్త్రోక్తంగా ఇరుముడి ధారణ



భీమడోలు అయ్యప్ప ఆలయంలో ఇరుముడి ధారణ పూజల్లో మాలధారులు



దెందులూరు: ఇరుముడులు ధరిస్తున్న అయ్యప్ప మాలధారులు

భీమడోలు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం స్వామి మాలధారుల ఇరుముడుల ధారణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయ పీఠంలో మండల దీక్షను పూర్తి చేసుకున్న 108 మంది మాలధారులు విశేష పూజలు అనంతరం ఇరుముడులను ధరించి శబరిమలకు పయనమయ్యారు. ఆలయ అర్చకులు గణపతి పూజ, ఇరుముడి పూజలను పూర్తి చేసి ఇరుముడులు ధరించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. 18వ మాల ధరించిన వారిని, గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావును నిర్వాహకులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఘనంగా సత్కరించారు. మాలధారులకు ఆలయం వద్ద 45 రోజులపాటు నిత్య అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ గురుస్వాములు, మాలధారులు, పెద్దలు పాల్గొన్నారు.

శబరిమలకు మాలధారుల పయనం

దెందులూరు: అయ్యప్ప మాలధారులు 45 రోజుల దీక్ష పూర్తిచేసుకుని అనంతరం గురుస్వాముల సమక్షంలో ఇరుముడులు ధరించి సోమవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మండలంలోని చల్ల చింతలపూడి శివారు తిమ్మన్నగూడెం గోపాలకృష్ణ ఆలయం నుంచి అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

సీనియర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి బాధాకరం

దెందులూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఆకస్మిక మృతి బాధాకరమని దెందులూరు, భీమడోలు తహసీల్దార్లు బి.సుమతి, రమాదేవి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబాన్ని సోమవారం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, దెందులూరు ఆర్ఐ హేమమాలిని, వీఆర్వోలు పరామర్శించారు.

ధాన్యం నిల్వ.. అధిక ప్రయోజనకరం

- క్రిమికీటకాలు దరి చేరకుండా చేయడమే ప్రధానం
- ఆశించిన గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం



దెందులూరులో తేమ శాతాన్ని తగ్గించేందుకు ధాన్యం ఆరబోసిన రైతులు

దెందులూరు: ఆరుగాలం శ్రమించి, అడ్డంకులను అధిగమించి ఖరీఫ్ సాగు పూర్తి చేసిన అన్నదాతలకు ధాన్యానికి గిట్టుబాటు ధర అందడం లేదు. దీంతో ధాన్యాన్ని భద్రపరచుకోవడంపై కొందరు రైతులు దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రక్రియ రైతులకు పెనుసవాలుగా మారింది. పండించిన ధాన్యాన్ని వెంటనే విక్రయించడం వల్ల కొంత మంది మిల్లర్లు తేమ అధికంగా ఉందంటూ ధరలో కోత విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు అంతగా చర్యలు తీసుకోకపోవడంతో పాటు అక్కడక్కడా దళారుల బెడద వల్ల పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రైతులకు ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాములు లేకపోవడంతో మెజార్టీ రైతులు తమ పంట ఉత్పత్తులను వెంటనే విక్రయించడం పరిపాటిగా మారింది. దీంతో రైతులందరూ ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయించుకున్న తరువాత ధర పెరగడం ప్రతి సీజన్‌కు నిత్యకృత్యమైంది. ఈ సమస్యలను అధిగమించేందుకు ధాన్యం నిల్వ చేసుకుని సరైన సమయంలో విక్రయిస్తే రైతులకు అధిక ప్రయోజనాలతో పాటు గిట్టుబాటు ధర దక్కుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభ నుంచి రైతులు పలుమార్లు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో వరదల కారణంగా వరి నాట్లు మునిగిపోవడంతో రైతులు నారు కొనుగోలు చేసిన రెండోసారి నాట్లు వేసి సాగు కొనసాగించారు. తెగుళ్ల నివారణకు పెట్టుబడి అధికమైంది.

కొద్దికాలం నిల్వ చేస్తే రైతుకు లాభం

పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొద్దికాలం నిల్వ చేస్తూ కనీస జాగ్రత్తలు పాటిస్తే రైతులు మంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వై. సుబ్బారావు చెబుతున్నారు. రైతులు ధాన్యం నిల్వ చేసుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే నష్టం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని ఆయన అన్నారు. ఖరీఫ్ ధాన్యానికి మరింత గిట్టుబాటు ధరను రాబట్టుకునేందుకు ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అనేక మంది రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక వేళ నిల్వ చేసుకోవడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ధాన్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ధాన్యాన్ని నూర్పిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాల కోసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు భద్రపరుచుకోవాలి.

ఎలుకల బెడద ప్రధాన ఆటంకం

ధాన్యాన్ని నిల్వ చేసుకునే సమయంలో ఎలుకల నివారణమే ముఖ్యంగా భావించాలి. ధాన్యం గిడ్డంగుల చుట్టూ చెత్త, చెదారం లేకుండా తరచూ శుభ్రం చేయాలి. వివిధ రకాల బోనులు, బుట్టలు ఉపయోగించి ఆ ప్రాంతంలోకి ఎలుకల రాకుండా జాగ్రత్తలు పాటించాలి. ధాన్యం గిడ్డంగుల తలుపుల కింది భాగంలో జింక్ రేకులను అమర్చాలి. తీగలు, మెస్ లాంటి పరికరాలు అమర్చి గిడ్డంగులకు ఏర్పడిన రంధ్రాలను మూసివేయాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

ధాన్యం నిల్వకు ఈ జాగ్రత్తలు మేలు

నిల్వ చేసుకునే ధాన్యాన్ని నష్టపరిచే క్రిమికీటకాల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. నిల్వ చేసుకునే ధాన్యానికి ముక్కు పురుగు, నుసి పురుగు, వడ్లచిలుక తదితర కీటకాలు ఎక్కువగా ఆశించి పట్టి పీడిస్తుంటాయి. వాటి నుంచి ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు చర్యలు తీసుకోవాలి.

ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించుకోవాలి

సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం సుమారు 20 శాతం వరకూ తేమ ఉంటుంది. ధాన్యాన్ని ఆరబెట్టడం ద్వారా తేమ శాతాన్ని ఐదు వరకూ తగ్గించుకోవచ్చు. ధాన్యంలో సుమారు 14 శాతం మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఎక్కువ. ఆ పరిస్థితులు లేకుండా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. క్రిమికీటకాలు, ఎలుకల బారిన పడకుండా పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకుని ధాన్యాన్ని సంరక్షించుకోవాలి. ధాన్యం నిల్వ చేసుకునే రైతులు వ్యవసాయశాఖ సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని నియమాలు పాటిస్తే క్రిమికీటకాల నుంచి పంట ఉత్పత్తిని రక్షించుకోవచ్చు.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి



రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకునేందుకు సిమెంటు, వెదురు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు, గిడ్డంగులు, సిమెంట్ కాంక్రీట్ గదులను ఉపయోగించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. క్రిమికీటకాలు, తేమ, వర్షపు నీరులోనికి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఎలుకలు ప్రవేశించే కన్నాలు ఉంటే గాజుపెంకులు ఉంచి సిమెంట్‌తో మూసివేయాలి. ధాన్యాన్ని నిల్వ చేసుకునే సమయంలో కొత్త గోనె సంచులను వినియోగించాలి. తొలుత గోనె సంచుల లోపల, బయట మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మరుసటి రోజు ఆ గోనె సంచులను ఎండలో పెట్టిన అనంతరం ధాన్యాన్ని నింపాలి.

– వై. సుబ్బారావు, వ్యవసాయశాఖ ఏడీ

వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

భీమడోలు: జాతీయ రహదారి అనుసంధానంగా ఉన్న గుండుగొలను వద్ద గోదావరి కాలువపై వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని గుండుగొలను వంతెన సాధన కమిటీ కన్వీనర్ టి.సుమన్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన భీమడోలులో మాట్లాడుతూ వంతెన నిర్మాణం చేపట్టి రెండేళ్లు పూర్తి కావస్తున్నా నేటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు, హైవే అధికారులు కాలువలోని నీటి ప్రవాహం సమస్య, భారీ యంత్రాలు అందుబాటులో లేవన్న సాకుతో నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. వంతెన నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ వంతెన గుండుగొలనుతోపాటు కొల్లేరు గ్రామాల ప్రజలకు అవసరమన్నారు. ఈ వంతెన పనులు పూర్తి కాకపోవడంతో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని కాలువపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేసారు.

దెందులూరులో అగ్నిప్రమాదం

దెందులూరు: దెందులూరులో షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిళ్లు దగ్ధమైంది. దెందులూరు శౌరిపురంలో వన్నెకూటి రాజు నివాసంలో ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు, వస్తు సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి.

తలసేమియా నివారణకు కృషి

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ఒక మండలాన్ని ఎంచుకుని తలసేమియా నివారణకు కృషి చేస్తామని భీమవరం ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు తెలిపారు. సోమవారం నారాయణపురంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజును వారు కలిసి కార్యక్రమ వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యుల సేవలను ఎమ్మెల్యే అభినందించారు.